కంచి పరమాచార్య

శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి

**అమృతవాణి**

**5**

# గణపతి

అనువక్త

దేవరకొండ శేషగిరిరావు

**ఎమెస్కో**

# విషయ సూచిక


| | |
|---|---|
| గణపతి | 9-144 |
| భక్తి | 145-180 |
| హనుమ | 181-208 |

# గణపతి

**త**మిళనాడులో ఎక్కడ చూచినా వినాయకుడి గుడి కన్పిస్తుంది. స్వామిని పిళ్లైయార్ అని తమిళులు పిలుస్తారు. పెద్ద పెద్ద గుళ్ళు, గోపురాలు లేక పోయినా ఏ రావిచెట్టు క్రిందో మనకు స్వామి సాక్షాత్కరిస్తాడు. చాలాచోట్ల పందిళ్ళు కూడా ఉండవు. స్వామికి ఆకాశమే పందిరి. ఇంచుమించు ప్రతి గ్రామంలోనూ, అంతే కాదు, ప్రతి వీథిలోనూ అడుగడుగునా తమిళనాడులో స్వామి సాక్షాత్కరిస్తాడు. సంఖ్యలో ఇతని తరువాతనే మిగతా దేవతల విగ్రహాలు. ఇతడు పార్వతీ పరమేశ్వరుల ప్రథమ సంతానం. తమిళంలో కొడుకుని పిళ్ళై అని అంటారు. గౌరవంతో బహువచనం ప్రయోగించినపుడు పిళ్ళైయార్ అంటారు.

వినాయకుని తమ్ముడే కదా కుమారస్వామి! కాని పిళ్ళైయార్ అన్నట్లుగా గౌరవ సూచకంగా బహువచనం వాడి కుమారర్ అని పిలువరు. కుమారన్ అనే పిలుస్తారు. ఇతని కంటే పెద్దవాడు కనుక వినాయకుని పిళ్ళైయార్ అంటారు.

ఇట్లా జగత్పితరులైన పార్వతీ పరమేశ్వరులకు మొదట పుట్టినవాడై, దేవుడై నుతింపబడ్డాడు. కనుక ప్రతి దానికి ఇతడు మొదలైనాడు. ప్రపంచం జీవులు అన్నీ ప్రణవం నుండి వచ్చాయి కదా! అట్టి ప్రణవానికి కనబడే రూపమే మన స్వామి. అతని ఏనుగు తల, వంకర తిరిగిన తుండం చూస్తూ ఉంటే ప్రణవాకారంగానే కన్పిస్తాడు.

ఇట్లా మొదటి పిల్లవాడై, పిల్లవానిగా కనబడే వాడై, ప్రణవాకారుడై, భక్తుల నుద్ధరించుటలోనూ మొదటివాడై వెలుగొందుచున్నాడు. అవ్వైయార్ అనే తమిళ కవయిత్రి ఇతని భక్తురాలు. ఇతణ్ణి ప్రణవాకారంగా రెండు కనుబొమల మధ్య ధ్యానిస్తూ ఉండేది. వినాయకర్ అవగళ్ అని ఆమె వ్రాసిన గ్రంథంలో యోగశాస్త్ర సారాన్ని వివరించింది. దీనిని పారాయణ చేస్తే జ్ఞానం పట్టుబడుతుంది. ఈమె గురించి ఒక కథ చెబుతారు. సుందరమూర్తి స్వామి, చేరుమాన్ పెరుమాళ్ నాయనార్ అనే భక్తులు

కైలాసానికి ప్రయాణమయ్యారు. నీవూ వస్తావా అని ఈమెనడిగారు. ఆ సమయంలో వినాయకుణ్ణి పూజిస్తూ ఉండేది. మీతో ప్రయాణం చేయడానికి నేను తొందరపడడం లేదు, వినాయకుణ్ణి పూజించడమే నాకు కైలాస యాత్రతో సమానమని ఆమె అనగా వారు ప్రయాణం సాగించారు. ఈమె భక్తికి మెచ్చుకొని వినాయకుడు తన తుండంతో ఒక్క ఉదుటున కైలాసానికి చేర్చాడు. అవ్వైయార్ తరువాతనే వారిద్దరూ కైలాసానికి చేరుకున్నారు. ఇట్టి విచిత్ర సంఘటనను అరుణగిరినాథుడు తన తిరుప్పుగళ్‌లో పళనిక్షేత్రాన్ని పేర్కొంటూ చేరరాజులు కొంగునాడు ప్రాంతాన్ని పరిపాలించేవారనే సందర్భంలో ఈ కథను పేర్కొన్నాడు.

ఇట్లా భక్త సులభుడు మన స్వామి.

## ఆధ్యాత్మిక సత్యాల ప్రతిరూపం

వినాయకునకు సంబంధించిన ప్రతి చిన్న విషయం, ఎన్నో ఆధ్యాత్మిక సత్యాలను వెల్లడిస్తుంది.

వినాయకునకు ముందు ఎందుకు కొబ్బరి కాయలు కొడతాం? దీనికొక కథ యుంది. ఒకనాడు నీ తలని బలీయవలసిందిగా తండ్రియైన పరమేశ్వరునే అడిగాడట. దానికి బదులుగా మూడు కన్నులున్న కొబ్బరికాయను శంకరుడు సృష్టించాడట. శంకరునకూ మూడు కన్నులే కదా! అతని తలకు బదులుగా ఇట్లా కొబ్బరికాయలను కొడతాం.

దానిని నేలమీద కొడితే ముక్క చెక్కలౌతుంది కదా! అయితే ఆ ముక్కల్ని ముఖ్యంగా ఎవరేరుకుంటారు? 1941లో జరిగిన ఒక సంఘటన గుర్తుకు వస్తోంది. నాగపట్టణంలో చాతుర్మస్య దీక్షలో అప్పుడున్నాను. కొబ్బరికాయలను కొడుతూ ఉండడం, పిల్లలు మూగడాన్ని చూసాను. జనులు కిటకిటలాడుతున్నారు. చోటు లేదు, పొండి పొండని పిల్లల్ని పెద్దలు తరుముతున్నారు. ఒక పిల్లవాడు ముందుకు వచ్చి కాయను కొట్టిన తరువాత ఈ ముక్కల్ని ఏరుకోవద్దని అనడానికి నీవెవరని గద్దించాడు. అతని ధోరణి చూసి అతడన్నది సబబే అనిపించింది.

కాయ బ్రద్దలైతే దానిలోంచి అమృతం వంటి నీరు వస్తుంది. ఇట్లా బ్రద్దలు కొట్టడం మన అహంకారాన్ని బ్రద్దలు కొట్టినట్లనిపిస్తుంది. ఇక స్వామి తల, ఏనుగు తల. అతడు స్థూలకాయుడు కూడా. పుష్టిగా ఉంటాడు. పిల్లలు బాగా తిని బొద్దుగా